# ఎర మింగిన మానవుడు -అంగర వెంకట శివప్రసాదరావు

ఆర్టీసీ బస్సు నడుస్తోంది. నాకు కూర్చోవడానికి సీటు దొరికింది. కండక్టరు దగ్గర టిక్కెట్టు తీసుకున్నాను. మిగిలిన చిల్లర చేతిలో పోసాడు. లెక్కపెట్టాను. సరిపోయింది. కండక్టరు కాస్త ముందుకి జరిగి టిక్కెట్లు యిస్తున్నాడు.

'కండక్టరు' పిలిచాను.

ఏమిటన్నట్లు చూసేడ.

'పది పైసలు ఎక్కువిచ్చారు' అంటూ. చిల్లరలోంచి పది పైసలు తీసి కండక్టరుకి యిచ్చాను.

కండక్టరు మొహంలో చిరునవ్వు.

'థాంక్స్ .. అందరు మీలావుంటే మాకు 'చిల్లర దేవుళ్ల' ని పేరొచ్చేది కాదు' అంటూ పదిపైసల నాణెం అందుకుని సంచీలో పడేసుకున్నాడు

* *

ఆర్టీసీ మా పాలిట ఆపద్బాంధవుడు. చంద్రుని కోసం చకోరంలా బస్టాపులో బస్సుకోసం తపస్సు చెయ్యాలి. బస్సు సకాలంలో వస్తే ఆనందం. అంతకన్నా జీవితంలో వేరే కోరిక లేదు సామాన్య మానవుడికి.

పెళ్ళి రోజని పిల్లలతో సినిమాకి బయలుదేరాను. వెళ్ళుతున్నప్పుడు వుండే ఆనందం తిరిగొచ్చేటప్పుడు లేదు. నడిచే పిల్ల నడవకుండా నిద్రకి జోగుతూ చంకదిగడం లేదు.

పెళ్ళిరోజు ఆనందం పిల్లల బరువులో జారిపోయింది. బస్సుకోసం తపస్సు గడ్డాలు మీసాలు కూడా వచ్చేసేయేమో!

ఆఖరి ట్రిప్పులు. అన్ని బస్సులు డిపోకే పోతున్నాయి.

చకోరం తపస్సు ఫలించింది. చివరకు దూరాన చుక్కలా మా యింటి వైపు వెళ్ళే బస్సు నిండు చూలాల్లా.

గుది బండల్ని మోస్తూ బస్సులో ప్రవేశించాం.

గాలాడ్డం లేదు. పిల్లలు చంక దిగడం లేదు. కండక్టరు టిక్కెట్లు యివ్వకుండానే డబ్బులు తీసుకుంటున్నాడు. అడిగే నాధుడేలేదు. బోనస్ ట్రిప్ అది.

అన్ని బాధల్లోనూ నేను కండక్టర్‌ని వెనక్కి పిల్చి యివ్వని పది పైసలు ఎక్కువిచ్చావని తిరిగిచ్చాను.

పది వరహాలు అందుకున్న ఆనందం కండక్టరు మొహంలో.

'వాడసలు చిల్లరే యివ్వలేదు. పది పైసలు ఎక్కడెక్కువిచ్చాడు. పక్కన పిచ్చి భార్య గొణుగుడు.

'హుష్ .... నోర్మూసుకో..' నా గదమాయింపు.

అరగంట ఆపసోపాలు పడ్డాక ముందుకి కదిలాను నేను.

'అప్పుడే ఎందుకూ....?' మరో పిచ్చి ప్రశ్న.

'నువ్వు నోర్మూసుకొని నాతో పద.' అన్నాను విసుగ్గా.

పది పైసల ప్రయోగంతో మాయింటి దగ్గర్లో బస్సాపాలని నా ప్రయత్నం.

నేషనల్ హైవే మీద కొత్తగా వెలిసింది మా కాలనీ. మా కాలనీకి అటు నాలుగు ఫర్లాంగులట, యిటు నాలుగు ఫర్లాంగుల దూరంలో ఆర్టీసీ స్టాపులున్నాయి.

మా కాలనీకి దగ్గర్లో రిక్వెస్టు పెట్టమని ఆర్టీసీ అధికారులకి అర్జీ పెట్టుకున్నాం మా కాలనీ వాళ్లమంతా.

అటో యిటో నాలుగు ఫర్లాంగులు నడవాలంటే మహ కష్టంగా వుంది.

అందుకే యీ పది పైసల ప్రయోగం.

'కండక్టర్.. కాస్త యిక్కడ ఆపు చేస్తావా ...' నా రిక్వెస్టు.

కండక్టరు మొహంలో మొదట్లో చికాకు. నా మొహంలో పదిపైసల నాణెం కనిపించి వుంటుంది.

డ్రైవరుకి ఆజ్ఞ జారీ చేసాడు. పెళ్ళాం పిల్లలతో హాయిగా యింటికెదురుగా బస్సు దిగాను. చీకట్లో బస్సు కదిలి పోయింది. ●

## నేనెందుకు రాస్తున్నాను?



* నేను ఎప్పుడూ సామాజిక ప్రయోజనం కోసం రచన చేయలేదు. నీతి బోధ కోసం కూడా రచన చేయలేదు. ధనవంతులంతా దుర్మార్గులనీ, పేదలంతా అమాయకులనీ, పేదవాళ్లను మాత్రమే ధనవంతులు దోచుకుంటున్నారనీ, ఈ వ్యవస్థ మారాలనీ బాధ్యతగా కూడా రచనలు చేయలేదు. ఒక వేళ నేను రాసే రచనల్లో ఏదైనా ఎక్స్‌ప్లాయింటేషన్ గురించిగానీ, నీతిగానీ, సామాజిక ప్రయోజనం గానీ ఎవరికైనా కనిపిస్తే, వాటిని కేవలం బాక్సాఫీసు ఫార్ములా కోసం మాత్రమే వాడాననుకోవాలి. ఎందుకు రాశాను, రాస్తున్నాను? అంటే, ఒక్కటే కారణం. తెలుగు అక్షరాలంటే నా కెంతో యిష్టం. అవెంతో తియ్యగా వుంటాయి. వాటిని అందంగా పొందిక చేయడంలో చదరంగం ఆడుకున్నంత హాయి వుందనుకుంటాను. నా హాయి కోసం రాస్తున్నాను. నా రచనలు పత్రికలో ప్రచురిస్తే అందరికీ హాయి కలుగుతుందని వాటిని పత్రికలకి పంపుస్తున్నాను. నిజంగానే అందరూ హాయిగా వుంటున్నారు, నా కథలు చదివి. నచ్చి, చదవడం సాగిస్తున్నవాళ్లు, నచ్చక నా కథలు చదవని వాళ్లూ; అందరూనూ.

\- డా॥ కె. వివేకానంద మూర్తి.

భంగో-అత్తలూరి సంకలనం నుంచి